క్లుప్తంగా

పెండింగ్ కేసులు పరిష్కరించండి



మాట్లాడుతున్న సీఐ నారాయణనాయక్

ఖానాపూర్: పెండింగ్ కేసుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఖానాపూర్ సీఐ నారాయణనాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో సీఐ సర్కిల్ పరిధిలోని ఎస్సైలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్‌స్టేషన్లలో విచారణలో ఉన్న కేసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఎస్సైలు ఆర్.శంకర్, రజనీకాంత్, ప్రభాకర్, రాజు తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం

భైంసారూరల్: మే డే పురస్కరించుకొని మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో దాదాపు 90 మందికిపైగా కార్మికులకు వైద్య పరీక్షలు చేశారు. ఎంపీపీ కల్పనజాదవ్ మాట్లాడుతూ లేబర్‌కార్డు కలిగిన కార్మికులకు ప్రభుత్వం 50 రకాల వైద్యపరీక్షలు ఉచితంగా చేయిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ పెద్దరాజన్న, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు భూమారెడ్డి, రాంకుమార్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని గాజులపేట్ 11కెవి ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. గాజులపేట్ డాక్టర్స్ లైన్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నానో డీఏపీ వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సోన్: మండలంలోని కడ్తాల్ రైతువేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులు, ఎరువులు, విత్తనాల డీలర్లకు బుధవారం నానో డీఏపీ వినియోగంపై అవగాహన కల్పించారు. మామిడి కాయలను సహజ పద్ధతిలో మాగబెట్టే అంద్రాయిడ్ పద్ధతిని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ముథోల్: మండలంలోని వడ్తాల గ్రామానికి చెందిన వీవోఏ రాణి భర్త రమేశ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వీవోఏల కమిటీ మండలాధ్యక్షులు రాజు ఆధ్వర్యంలో వీవోఏలు ఆమె కుటుంబానికి రూ.ఏడు వేల ఆర్థిక సాయం అందించారు. వీవోఏల సంఘం మండల కార్యదర్శి కేర్బా, కోశాధికారి శ్రీలత, వీవోఏలు పోశెట్టి, లత, ఫాతిమా, సునంద, రాధ, అర్జున, మమత, దేవేందర్, శోభ, సాయినాథ్, రామ, ముత్తవ్వ పాల్గొన్నారు.

ఫోన్ అప్పగింత

కడెం: ఖానాపూర్ పట్టణానికి చెందిన పడకంటి మహేందర్ గత నెల 24న కడెం మండల కేంద్రంలో రూ.14వేల విలువైన ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్‌ను ట్రేస్ చేసి పట్టుకున్నారు. బుధవారం ఎస్సై రాజు, రైటర్ శంకర్ మహేందర్‌ను స్టేషన్‌కు పిలిపించి ఫోన్ అప్పగించారు.

కలెక్టరేట్ ముట్టడికి తరలిన వీవోఏలు



ఖానాపూర్ నుంచి వెళ్తున్న వీవోఏలు

ఖానాపూర్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని వీవోఏలు సమ్మె చేపట్టిన విషయం తెలిసిందే. ఖానాపూర్‌లో దీక్ష చేస్తున్న వీవోఏలు బుధవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ముట్టడికి తరలివెళ్లారు. సంఘం జిల్లా కమిటీ పిలుపులో భాగంగా కలెక్టర్‌కు సమస్యలు విన్నవించేందుకు వెళ్తున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని వేడుకున్నారు. లావణ్య, గంగాధర్, రవీందర్ తదితరులు ఉన్నారు.

పరామర్శ

ఖానాపూర్: అనారోగ్యంతోపాటు ఇటీవల కోతుల దాడిలో గాయపడ్డ సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి నందిరామయ్యను బుధవారం బీఆర్‌ఎస్ నాయకుడు భూక్య జాన్సన్‌నాయక్ పరామర్శించారు. సంతోశ్, రాజశేఖర్, అజయ్, మల్లేశ్ ఉన్నారు.

వడ్‌ఝురి(బి)లో తాగునీటి కష్టాలు

- నాలుగు బోర్లు, రెండు చేతిపంపులు
- ఒక్కటీ పని చేయని వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- నీటిని కొంటున్న గ్రామస్తులు
- భగీరథ జలం సరఫరా చేయాలని వేడుకోలు



ప్రైవేటు బోరు మోటారు నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు



వృథాగా భగీరథ నీటి ట్యాంక్

తానూరు: ఇంటింటికీ శుద్ధజలం అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టింది. కాని మండలంలోని బోల్సా పంచాయతీ పరిధిలోని వడ్‌ఝురి(బి)లో భగీరథ నీరు సరఫరా కావడం లేదు. దీంతో గ్రామస్తులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఒక్క బోరూ పని చేయడం లేదు..

మండల కేంద్రానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న బోల్సా పంచాయతీకి అనుబంధ గ్రామమైన వడ్‌ఝురి(బి) గ్రామంలో 150 కుటుంబాలు, జనాభా 400 మంది వరకు ఉన్నారు. నాలుగు వార్డులకు గాను నాలుగు సింగిల్‌ఫేజ్ బోరుమోటార్లు, రెండు చేతిపంపులు ఉన్నాయి. అందులో ఒక్కటీ పని చేయకపోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

ట్యాంకుకు అనుసంధానం చేయని వైనం..

మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు పూర్తయినా నీటి ట్యాంక్‌కు అనుసంధానం చేయలేదు. మరోవైపు గ్రామం గుట్టకు ఆనుకొని ఉండటంతో ఏటా వేసవిలో తాగునీటి సమస్య తలెత్తుతుందని గ్రామస్తులు వాపోతున్నారు.

ఏడాదికి రూ.మూడు వేలు చెల్లించి..

గ్రామంలో ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన నీటి పథకాల బోరు మోటార్లు పని చేయడం లేదు. దీంతో గ్రామస్తులు వ్యవసాయ బావుల వద్ద నుంచి ఏడాదికి ఒక్కో కుటుంబం రూ. మూడు వేలు చెల్లించి పైప్‌లైన్ ద్వారా నీటిని తీసుకుంటున్నారు. ఆర్థిక స్తోమత లేని వారు కిలోమీటర్ దూరంలో ఉన్న వ్యవసాయ బావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. కరెంట్ పోయినప్పుడు పరిస్థితి దారుణంగా ఉంటుందని ఈ విషయమై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నవారు ఎడ్లబండిపై నుంచి నీటిని తెచ్చుకుంటే.. లేని వారు వ్యవసాయ పనులకు వెళ్లకుండా నీటి కోసం ఇంటి వద్దే ఉంటున్నామని తెలిపారు.

కానరాని భగీరథ జలం..

గ్రామంలో భగీరథ పైపులైన్ పనులు పూర్తి చేసి ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. కాని నీటిని ట్యాంక్‌లోకి ఎక్కించకపోవడంతో ఇంటింటికీ భగిరథ నీరు సరఫరా చేయడం లేదు.అనుబంధ గ్రామం కావడంతో అధికారులు వచ్చి సమస్యలు తెలుసుకున్న దాఖలాలు లేవని గ్రామస్తులు వాపోతున్నారు.

చుట్టాలు ఇంటికి రావడం లేదు



గ్రామంలో ఉన్న బోరుమోటార్లు పని చేయడం లేదు. ఇంటి దగ్గర శుభకార్యం జరిగితే ఇబ్బంది పడుతున్నాం. చుట్టాలు సైతం నీరు సరిగా ఉండదని ఊరికి రావడం లేదు.రాత్రి వ్యవసాయ బావుల వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్నాం. అధికారులు స్పందించి భగీరథ నీరు ఇంటింటికీ సరఫరా చేసి సమస్య పరిష్కరించాలి. – కదం బాబురావ్, గ్రామస్తుడు

ఏడాదికి రూ.మూడు వేలు చెల్లిస్తున్నాం



గ్రామంలో తాగునీటి పథకాలు పని చేయడం లేదు. దీంతో ఏడాదికి రూ.మూడు వేలు చెల్లించి వ్యవసాయ బావుల వద్ద నుంచి నీటిని తీసుకుంటున్నాం. పలుమార్లు అధికారులు, నాయకులకు విన్నవించినా పట్టించుకోవ డం లేదు. – దేవుకబాయి, గ్రామస్తురాలు

త్వరలోనే తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

మండలంలోని వడ్‌ఝురి(బి)లో తాగు నీటి సమస్య మా దృష్టికి రాలేదు. పైపులైన్లకు లీకేజీలు ఏర్పడటంతో ట్యాంక్‌లోకి నీరు ఎక్కడం లేదు. భగీరథ నీరు ట్యాంక్‌కు ఎక్కేలా చర్యలు తీసుకుంటాం. త్వరలో గ్రామం సందర్శించి పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టి నీటి సమస్య పరిష్కరిస్తాం. – పృథ్వీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	10
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	50
కాకరకాయ	50
బీరకాయ	60
క్యారెట్	100
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	120
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

– నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : ఏజెంట్
నారాయణ: విరూపాక్ష

ప్రతీ గింజ కొనుగోలు చేస్తాం

- ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



మన్మద్‌లో కేంద్రం ప్రారంభిస్తున్న విఠల్‌రెడ్డి

లోకేశ్వరం: యాసంగిలో రైతులు పండించిన ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మన్మద్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఆందోళన చెందవద్దని.. అకాల వర్షాలతో నష్టపోయిన వారికి పరిహారం అందిస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందుల్లేకుండా చూస్తామన్నారు. నిధులు మంజూరు చేసి అర్లి వంతెన నిర్మిస్తామన్నారు. అంతకుముందు బీరప్ప విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బీరప్ప ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌బాబు, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, సర్పంచ్ శేఖర్‌రెడ్డి, భోజన్న, ప్రశాంత్, శ్రీధర్, చిన్నారావు, శ్యాంసుందర్, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కుంటాల: బంగారు తెలంగాణ సాధనే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఓలా గ్రామంలో రూ.17లక్షలతో నిర్మించే షాదీఖానాకు భూమిపూజ, ఓలా రోడ్డు నుంచి రాజాపూర్‌తండా వరకు రూ.కోటి 16లక్షల ఐటీడీఏ నిధులతో నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కనీశ్‌ఫాతిమా, ప్రదీప్‌కుమార్, బాపురావు, దాసరి కిషన్, హైమ్మద్, డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్, శంకర్‌గౌడ్, బుచ్చన్న, రాజన్న, మహేశ్వర్, మురళి, వసంత్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

- తరలిరానున్న భక్తులు
- రేపు కాల్వలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణం
- ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ



స్వామివారి ఆలయం

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వ పరిసర అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఏటా వైశాఖ మాసంలో (గురువారం నుంచి) ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలకు ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. గురువారం ఉదయం స్థాపనం, నరసింహ జయంతితో ఉత్సవాలు ప్రారంభమవుతాయని వేదపండితులు చక్రపాణి నరసింహమూర్తి, శ్రీమాన్ వాసుదేవచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ చిన్నయ్య తెలిపారు. సాయంత్రం స్వస్తివచనం, సకల దేవతాస్థాపనం, అంకురారోహణం, మంత్రపుష్పం తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు. ఈనెల 5న శుక్రవారం ఉదయం నిత్యార్చన, అగ్నిప్రతిష్ట, యజ్ఞం, మధ్యాహ్నం ధ్వజారోహణం, బలిహరణం అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు సభ్యులు పేర్కొన్నారు. ఈనెల 6న స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉదయం నిత్యార్చన, తీర్థప్రసాద వితరణ, సామూహిక నవగ్రహపూజ, సాయంత్రం హవణం, బలిహరణం, 7న బేరీపూజ, 8న నిత్యపూజలు, పర్వతారోహణం, దీపారాధన, నివేదన, 9న నిత్యార్చన, హోమం, బలిహరణం, పుష్కరిణిలో చక్రతీర్థ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 10న తెల్లవారుజామున స్వామివారి నాగవెల్లి కార్యక్రమం, 11న స్వామివారి రథోత్సవం, 12న నిత్యపూజ కార్యక్రమాలు, 13న మారువెళ్లి స్వామివారి సేవల నిర్వహణతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని పండితులు పేర్కొన్నారు.

కల్యాణం రోజున నిర్మల్ నుంచి బస్సులు..

భక్తుల సౌకర్యార్థం కల్యాణం రోజున శుక్రవారం నిర్మల్ నుంచి ఆలయం వద్దకు ఆర్టీసీ వారు బస్సులు నడుపనున్నారు. ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అన్ని సౌకర్యాలు కల్పించాం

శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాం. శుక్రవారం స్వామివార్ల కల్యాణం వీక్షించేలా ఏర్పాట్లు చేశాం. కల్యాణం అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేస్తాం.
– నిమ్మల చిన్నయ్య, ఆలయ కమిటీ చైర్మన్

కనుల పండువగా వార్షికోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్



లోకేశ్వరం: నగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీ లలితా పరమేశ్వరి, అయ్యప్ప ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం బుధవారం కనుల పండువగా సాగింది. అర్చకులు శరత్ చంద్రశర్మ, నర్ర నితీశ్, జగన్నాథం విజయ్, కుసుంబ రఘు, నాంపెల్లి విజయ్ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా గణపతి, గౌరీపూజ, స్వస్తి పుణ్యాహవచనం, అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృత నవరసాభిషేకాలు, హోమాలు, మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తమాచార్యుల ఆధ్వర్యంలో మహాపడిపూజ నిర్వహించారు. అంతకుముందు ఖానాపూర్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి జితిన్‌కుమార్, ఎమ్మెల్యే రేఖానాయక్, మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, బీఆర్‌ఎస్ నాయకుడు జాన్సన్‌నాయక్, కౌన్సిలర్ చిన్నం సత్యం, వేర్వేరుగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు కొత్తపెల్లి సురేశ్, అధ్యక్ష, కార్యదర్శులు అడిదెల రాజన్న, గడబోయిన అశోక్, గురుస్వామి పాపారావు, సభ్యులు రమేశ్, బుచ్చన్న, కిషన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బుధవార్‌పేట్ బోయవాడలో గంగామాత ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

లోకేశ్వరం: మండలంలోని నగర్ గ్రామ లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం శాంతిపాఠం, స్థాపిత దేవతపూజ, చండీహోమం, హారతి, నివేదిత, మంత్రపుష్పం, ప్రసాద వితరణ కార్యక్రమాలను వేపండితులు సంతోశ్‌జోషి నిర్వహించారు. అనంతరం భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సన్మానం

ఖానాపూర్: నిర్మల్ జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రెండోసారి నియమితులైన కల్వకుంట్ల వినోద్‌రావును ఖానాపూర్ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. జిల్లాకేంద్రంలోని నిర్మల్ కోర్టు పీపీ నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, మాజీ జెడ్పీటీసీ రామునాయక్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు..

తానూరు: తానూరులో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించి బదిలీపై పెంబి మండలానికి వెళ్తున్న లచ్చారాంను బుధవారం కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది సన్మానించారు. మరోవైపు నిర్మల్ అర్బన్ డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న గంగయ్య.. బదిలీపై వచ్చి తానూరు డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. వారిని సిబ్బంది సత్కరించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, ముథోల్ తహసీల్దార్ తుకారం, ఆర్ఐ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: సమ్మర్‌క్యాంప్‌ను 10 నుంచి 15 ఏళ్లలోపున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రం ఇన్‌చార్జి గంట క్రాంతి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల మైదానంలో సమ్మర్‌క్యాంప్ కేంద్రంలో మాట్లాడారు.

బీమాపై హర్షం

భైంసాటౌన్: ప్రమాదవశాత్తు మరణించిన గీత కార్మికులకు రూ.5లక్షల బీమా అందించాలని తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షనీయమని గౌడ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్‌లో నీరా కేఫ్‌ను ప్రారంభించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

అకాల వర్షం.. తెచ్చింది కష్టం



భైంసాలో వీధుల్లో తిరుగుతూ తర్బుజా అమ్ముతున్న రైతు మోతీరాం

భైంసాటౌన్: అకాల వర్షాలు రైతుల్ని నట్టేట ముంచుతున్నాయి. భైంసా మండలం దేగాం గ్రామానికి చెందిన మోతీరాం అనే రైతు రూ.70వేల ఖర్చుతో ఎకరం భూమిలో తర్బుజా సాగు చేశాడు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చేతికొచ్చిన తర్బుజా పంటను కొనే వ్యాపారులు కరువయ్యారు. మరోవైపు చేనులో ఉంటే కాయలు దెబ్బతింటాయి. దీంతో రైతే ఆటో మాట్లాడుకుని భైంసాలో వీధుల్లో తిరుగుతూ రూ.పదికి ఒకటి చొప్పున అమ్ముతూ కనిపించాడు. కనీసం మందులకు పెట్టిన డబ్బులైనా వస్తాయనే ఆశతో పంట అమ్ముకుంటున్నట్లు మోతీరాం ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని వేడుకున్నాడు.

జిల్లా ప్రథమ స్థానం సాధించాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో భాగంగా జిల్లా ప్రథమ స్థానం సాధించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌పై జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 15 గ్రామాలను ఎంపిక చేసి మోడల్ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. గ్రామీణ ప్రాంతాల పారిశుద్ధ్య స్థితి అంచనా వేసే కీలకమైన పరిమాణాత్మక, గుణాత్మక స్వచ్ఛభారత్ మిషన్ పనితీరు ఆధారంగా ర్యాంకులు కేటాయిస్తారని పేర్కొన్నారు. గ్రామాల్లో ఓడీఎఫ్ ప్లస్ మార్గదర్శకాలకు అనుగుణంగా మరుగుదొడ్లు నిర్మించుకోవాలన్నారు. తడి, పొడి చెత్త సక్రమ నిర్వహణ, వాల్ పెయింటింగ్స్, సౌకర్యాలు, సదుపాయాలు కల్పించి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. అందుకనుగుణంగా అధికారులు శ్రద్ధ కనబర్చి అవార్డు సాధనకు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. సమావేశంలో సీఈఓ సుధీర్, డీఆర్డీవో విజయలక్ష్మి, సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

జేపీఎస్‌లను క్రమబద్ధీకరించాలి



బతుకమ్మ ఆడుతున్న జేపీఎస్‌లు

నిర్మల్‌చైన్‌గేట్: ఇచ్చిన హామీ మేరకు తమను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట జేపీఎస్‌లు చేపట్టిన దీక్ష బుధవారం ఆరోరోజుకు చేరింది. ఈ సందర్భంగా మహిళా జేపీఎస్‌లు రోడ్డుపై బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ఇప్పటికైనా తమను రెగ్యులరైజ్ చేయడంతోపాటు తమ సమస్యలు పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోండి

కుంటాల: ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ గజ్జారాం పేర్కొన్నారు. బుధవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో అంబకంటి, కుంటాలలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, సర్పంచ్ ప్రదీప్‌కుమార్, ఎంపీవో రహీం, ఎంపీటీసీ సుధాకర్, సీఈవో నాగభూషణం, డైరెక్టర్లు గజ్జారాం, ప్రణయ్‌రావు, సాయినాథ్, సురేశ్ ఉన్నారు.

ముథోల్ : మండలంలోని చింతకుంటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ ప్రారంభించారు. సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న సీఐకి సన్మానం



సీఐకి జ్ఞాపిక అందిస్తున్న డైరెక్టర్, ఎస్సై, సిబ్బంది

భైంసాటౌన్: బాసర ఆర్జీయూకేటీలో సెక్యూరిటీ అధికారిగా పని చేసి బదిలీపై వెళ్తున్న సీఐ రవీందర్‌నాయక్‌ను వర్సిటీ అధికారులు బుధవారం ఘనంగా సన్మానించారు. డైరెక్టర్ సతీశ్‌కుమార్ శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. సీఐ మాట్లాడుతూ ఆర్జీయూకేటీ బాసరలో పని చేయడం సంతృప్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎస్సై రోహిణి, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు ఉన్నారు.